## క్లుప్తంగా...

### బీసీ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల కేలండర్‌ను జాతీయ బీసీ సంఘాల అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు ఇవ్వాలని, క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అధ్యక్షులు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్, రమేష్, కృష్ణ, రవీందర్, జనార్దన్ తదితరులున్నారు.

### దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన కొత్వాల్‌గూడ ప్రజలు

**శంషాబాద్:** పట్టణంలోని కోత్వాల్‌గూడలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయానికి ఘనమైన చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. 16వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజుయాదవ్, రఘుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, యాదయ్య, కృష్ణ, రాజురెడ్డి, రాజు, ప్రవీణ్‌యాదవ్, పూర్ణచంద్ర, జగదీశ్వర్‌చారి, రాజుగౌడ్, లింగం యాదవ్, అంజయ్యగౌడ్, మహేష్‌యాదవ్, వినోద్‌యాదవ్ తదితరులున్నారు.

### మంత్రి సబితారెడ్డికి ఘన స్వాగతం



మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డితో మణికొండ కౌన్సిలర్‌లు

**మణికొండ:** విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, పలు సంఘాల వారు ఘనస్వాగతం పలికారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో రూ.1.70 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించేందుకు మంత్రి హాజరయ్యారు. కొన్నేళ్ల తర్వాత ఆమె మణికొండకు రావడంతో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం, వీఫర్‌యూ సంస్థ ప్రతినిధులు, మాంగల్యం ఫౌండేషన్, కృషి ఫౌండేషన్, పలు కాలనీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంత్రికి స్వాగతం పలికారు.

# ‘ఆసరా’కు గంటలు నిలబడాలా?

**తీవ్ర ఇబ్బంది పడుతున్న వికలాంగులు, వృద్ధులు**



బండ్లగూడ జాగీర్ పోస్టాఫీస్ వద్ద ఇలా..

**బండ్లగూడ:** ఆసరా పింఛన్ పంపిణీని తపాలా కార్యాలయం ద్వారా ఇవ్వడంతో లబ్ధిదారులు ఒక్కసారిగా వందల సంఖ్యలో పంపిణీ కేంద్రానికి చేరుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి డాన్‌బాస్కోనగర్‌లోని పోస్టాఫీసు వద్ద ప్రతినెలా మొదటి వారంలో వేల సంఖ్యలో లబ్ధిదారులు ఉదయం నుంచే గంటల తరబడి బారులు తీరుతూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



పింఛన్ కౌంటర్ వద్ద లబ్ధిదారుల తాకిడి..

**లబ్ధిదారుల సంఖ్య 3527 మంది..**

కార్పొరేషన్ పరిధి డాన్ బాస్కోనగర్ పోస్టాఫీసులో ఆసరా పింఛన్ తీసుకునే లబ్ధిదారులు వితంతు, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు దాదాపుగా మొత్తం నెలకు 3,527 మంది వరకు ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 400 మంది వరకు మాత్రమే ఉన్నారు.

- దూర ప్రాంతాల నుంచి వచ్చి పింఛన్ తీసుకునేవారే ఎక్కువగా ఉన్నారు. బుధవారం పోస్టాఫీస్ వద్ద పెద్ద ఎత్తున ఆసరా పింఛన్ తీసుకునే వారు రావడంతో క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- వృద్ధులు, దివ్యాంగులకు సమీప ప్రాంతాల్లోనే ఫించన్లు చెల్లించే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ తపాలా సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు వృద్ధులకు, దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.
- గత 4 నెలల క్రితం కొత్తగా ఆసరా పింఛన్‌కు ఎంపికైన లబ్ధిదారులు చంద్రాయణగుట్ట, వట్టిపల్లి, బ బహదూర్‌పూర, అత్తాపూర్, కాటేదాన్, శాస్త్రీపురం, శివరాంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ప్రతినెల బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధి పోస్టాఫీసులో పింఛన్ తీసుకొనే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. దూరప్రాంతాల వారికి సమీపంలో ఇచ్చేవిధంగా తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

**చార్జీలకే వందలు పెట్టాలి..**



ప్రతి నెల నేను కాటేదాన్ నుంచి బండ్లగూడ జాగీర్‌కు వచ్చి పింఛన్ తీసుకుంటున్నాను. నెల నెల చార్జీలకే వందలు పెట్టాలి. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఇబ్బంది పడుతున్నాను. నాకు ఆరోగ్యం సరిగ్గా లేదు. బ్యాంకు ఖాతాలోనే నేరుగా డబ్బులు వచ్చేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– నర్సింహులు, ఆసరా పింఛన్ లబ్ధిదారుడు, కాటేదాన్

**మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలి..**



క్యూలైన్‌లలో ఒకరిపై ఒకరు పడుతూ తోపులాట జరుగుతోంది దీంతో తీవ్ర ఇబ్బంది నెలకొంటుంది. వేల మంది పింఛన్‌దారులకు ఒక్కటే కౌంటర్, ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే ఉండటంతో సమస్యలు తలెత్తున్నాయి. సరిపడ సిబ్బందిని ఏర్పాటు చేసి మరిన్ని ఫించన్ కౌంటర్లను ఏర్పాటు చేసి అవస్థలు, ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– జహీరా బేగం, వినాయకనగర్ కాలనీ

# అత్తాపూర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యం

**రాజేంద్రనగర్:** ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. సిక్‌చౌనీ గురుద్వారా, మారుతీనగర్‌లలో తాగునీటి పైప్‌లైన్‌లకు బుధవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తాగునీటి పైపులైన్ వ్యవస్థ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులతో చర్చించి కొత్త పైపులైన్‌ను వేసేందుకు తగిన చర్యలను ప్రారంభించామన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, రాచూరి రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, రాజు, గురుప్రీత్‌సింగ్, విజయ్, సోనుసింగ్, జలమండలి ఏఈ వినాయక్, లైన్‌మెన్ జగదీష్, భూషణం తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**రాజేంద్రనగర్:** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో జేఏసీ కన్వీనర్ చంద్రయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్.కృష్ణ అన్నారు. రవాణా రంగం, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సంఘర్షయాత్ర వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికుల సంఘర్షయాత్ర ఈ నెల 6న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డిపో వద్దకు రావాలని సూచించారు. ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన రెండు వేతన సవరణలు చేయాలని కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. ఆర్టీసీలో యూనియన్ కార్యకలాపాలను అనుమతించి ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ యాత్ర కొనసాగుతుందని దీనిని విజయవంతం చేయాలని కోరారు.



## ఇన్‌స్టా ప్రకటనతో రూ.23వేలు పోగొట్టుకున్న యువకుడు

**శంషాబాద్ రూరల్:** ఇన్‌స్టాగాంలో రెట్టింపు డబ్బుల ప్రకటనను చూసి రూ.23వేలు పోగొట్టుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన కుమ్మరి శ్రీశైలం గతేడా ది అక్టోబర్ 29న ఇన్‌స్టాగాంలో ఓ వీడియో చూసి రెట్టింపు చెల్లిస్తామన్న ప్రకటనను చూసి ప్రకటన నంబరుకు రూ.3వేలు గూగుల్ పే ద్వారా పంపించాడు. అనంతరం ఓ మహిళ చాటింగ్ చేసి మరిన్ని డబ్బులు పంపించాలని కోరడంతో రూ.7999 వేశాడు. తర్వాత రూ.12వేలు, మొత్తంగా రూ.23వేలు పంపాడు. డబ్బులు పంపిన తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభినందన

**మణికొండ:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ‘ఉపకులపతి ఉత్తమ పరిశోధన’ అవార్డును అందుకున్న సీబీఐటీ అధ్యాపకుడు డాక్టర్ టి. సుధాకర్‌బాబును ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి అభినందించారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమర్థవంతమైన పరిశోధకుడు, అతడి పరిశోధనా రంగాలు పవర్ ఎలక్ట్రానిక్స్, వనరులు పునరుత్పాదక శక్తిపై అనేక పరిశోధనలు చేసి పలు పత్రికల్లో కాలమ్స్ రాశారన్నారు. వాటిని పరిశీలించి అతడికి ఉత్తమ పరిశోధకుడిగా అవార్డును అందజేశారన్నారు. కళాశాల రీసెర్చ్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎడీ శర్మ, ఇన్నొవేషన్స్, ఇంక్యుబేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమాకాంత్‌చౌదరి, అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణవేణి, ప్రొఫెసర్ వెంకటప్రసాద్, పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# డివిజన్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశం

**రాజేంద్రనగర్:** నియోజకవర్గంలో బీజేపీ ఎదురు లేని శక్తిగా ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్‌ల అధ్యక్షతన శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి బాల్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ నెల 7 న బీజేపీ జాతీయ అధ్యక్షులు జే.పీ.నడ్డా బూత్ లెవల్ కమిటీ వర్చువల్ సమావేశానికి ప్రతీ బూత్ నుంచి పూర్తిస్థాయి కమిటీ సభ్యులతో హాజరుకావాలన్నారు. శ్రీనివాస్‌గౌడ్, పోల్కర్‌రెడ్డి, మంజులారెడ్డి, హరికిషన్ జీ, రాఘవేంద్రచారి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, సురేందర్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

# మెదడువాపు నివారణకు టీకాలు

**మణికొండ:** 9 నెలలు పూర్తయిన చిన్నారులకు కొత్తగా వచ్చిన ఫంక్షనల్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్(ఐపీవీ)ను వేయిస్తే పిల్లల్లో మెదడువాపు వ్యాధి నుంచి రక్షణ పొందుతారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధి మంచిరేవుల ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల్లో వస్తున్న వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు వారికి వ్యాక్సిన్‌లను అందజేస్తున్నామన్నారు.

- జపానీస్ ఎన్సెఫాలిటీస్ వ్యాక్సిన్ పిల్లలకు భవిష్యత్తులో వచ్చే మెదడువాపు సమస్యలన్నింటినీ నివారిస్తుందన్నారు.
- చిన్నపిల్లలున్న తల్లిదండ్రులు వీటిని తమ పిల్లలకు తప్పనిసరి వేయించాలని సూచించారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్‌లను అందిస్తామన్నారు. జిల్లా ఇమ్యునజేషన్ అధికారి స్వర్ణకుమారి, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, పీహెచ్‌ఎన్ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

## ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ వితరణ

**మణికొండ:** వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారికి తమ వంతు సాయంగా ఆదుకుంటామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన మణికొండ హుడా కాలనీలోని ఎస్‌ఆర్‌ఆర్ వృద్ధాశ్రమంలో వారికి అవసరమైన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కొందరు తప్పనిసరిగా తమ తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్‌లో ఉంచాల్సి వస్తోందన్నారు. మరికొందరు చూసేవారు లేక వాటిల్లోనే ఉంటున్నారన్నారు. వారిని ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, కౌన్సిలర్‌లు ఎల్. వందన నగేష్, హైమాంజలి అనిల్‌కుమార్, బి.శ్వేతారవికాంత్‌రెడ్డి, లావణ్య నరేష్, మీన ముత్యాలు, కావ్యశ్రీరాములు, ఎస్. శ్వేతాకిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



## శబరిమలకు అయ్యప్ప స్వాములు

**రాజేంద్రనగర్:** గాంధీనగర్ అయ్యప్పస్వామి నామస్మరణతో స్వామివారి దేవాలయం మార్మోగింది. స్వాములు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఇరుముడులు కట్టుకుని శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. సత్యనారాయణ ముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరికి బయలుదేరారు.



## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

**బండ్లగూడ:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ 12వ రోజుకు చేరింది. బుధవారం కార్పొరేషన్ 3,4వ డివిజన్ మాధవినగర్, న్యూ మాధవినగర్, పీజీ కాలనీ–1,2, మారుతీనగర్, కుక్కలమాన్యం, కేంద్రీయ విహార్ నుంచి మొయిన్ రోడ్డు, మాధవినగర్ చర్చి రోడ్డు, శ్రీరామ్‌నగర్ కాలనీ, హైదర్షాకోట్ ఓల్డ్ విలేజ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సంతోషి కుమారి, రవీందర్‌రెడ్డిలు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ, వెంకటేష్, గిరి, తౌఫిక్, లక్ష్మీనారాయణ, జగన్, రాము తదితరులున్నారు.

## టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్



పోటీల్లో క్రీడాకారులు

**మైలార్‌దేవ్‌పల్లి:** విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందని టీఎస్‌టీటీఏ అధ్యక్షులు కె.కె.మహేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాష్‌రాజు అన్నారు. మహవీర్ కళాశాలలో రాష్ట్రస్థాయి జిల్లా టెబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, చైర్మన్ ఎస్.జయలక్ష్మి, ట్రెజరల్ అగ్నిహోత్రి, ప్రిన్సిపాల్ బీ.వీ.శంకర్‌రావు, డాక్టర్ సతీష్‌బాబు, సీతారామారావు తదితరులున్నారు.

# వృత్తి నైపుణ్యంతో ఉపాధికి బాటలు!

- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులు

**శంషాబాద్:** యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభమైన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని యువత, మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కంప్యూటర్, ఫ్యాషన్‌డిజైనింగ్, బ్యుటీషియన్ కోర్సులు కొనసాగుతుండగా అధికంగా ఫ్యాషన్ డిజైనింగ్‌లో మహిళలు శిక్షణ పొందుతున్నారు.

- కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే దిశగా కూడా మరికొందరు మహిళలు ఈ శిక్షణకు హాజరై తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు.

**ఉపాధికి ఊతం..**

- ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు వారి నైపుణ్యాలు ఉపాధికి ఊతమందించేలా ఉన్నాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- కంప్యూటర్‌తో పాటు సీసీ కెమెరాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన కోర్సు మహిళలతో పాటు పురుషులకు ఉన్నప్పటికీ వారి చేరిక తక్కువగానే ఉంది.

**సీసీ టీవీ టెక్నిషియన్ కోర్సు..**

- సీసీ టీవీ టెక్నిషియన్ కోర్సును త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు. మూడు నెలల కాలపరిమితికి ఈ కోర్సులో చేరేందుకు ఔత్సాహిక యువతి, యువకులకు దరఖాస్తులకు ఆహ్వానం కోరుతున్నారు. మరిన్ని వివరాలకు 9440946083 నంబరును సంప్రదించాలని కోరారు.



శిక్షణ పొందుతున్న మహిళలు



కంప్యూటర్ శిక్షణ పొందుతున్న మహిళలు

**పనినేర్చుకుంటున్నాం..**

ఫ్యాషన్ డిజైనిం గ్‌లో మెళుకవలు నేర్పిస్తున్నారు. సొంతంగా మిషన్ పెట్టుకుని దుస్తులు కుట్టే విధంగా మమ్మల్ని తీర్చిదిద్దుతున్నారు. కోర్సు బాగుంది. అన్ని రకాల దుస్తుల తయారీ కటింగ్ కూడా నేర్పిస్తున్నారు.

తాహేరా బేగం – శంషాబాద్

**ఎంఎస్ ఆఫీస్‌లో శిక్షణ**

బేసిక్స్‌తో పాటు ఎంఎస్‌ఆఫీస్‌లో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. ఇప్పుడు అన్ని ఉపాధి రంగాల్లో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా చక్కటి అవకాశాన్ని స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలి.

రాణి– కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్

# పాఠశాల నూతన భవనం ప్రారంభోత్సవం

- కేజీటూ పీజీ ఒక్క రోజులో సాకారం కాదు
- వేల సంఖ్యలో గురుకులాల ఏర్పాటు
- మొదటిరోజే పుస్తకాలు, యూనిఫాం అందజేస్తాం



మణికొండ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి సబితారెడ్డి

**మణికొండ:** రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 26 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేస్తామని, కేజీ టూ పీజీ విద్యా వ్యవస్థ ఒక్కరోజులోనే సాకారం కాదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. బుధవారం ఆమె మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా మున్సిపాలిటీ నిధులు రూ.1.70 లక్షలతో నిర్మించిన అధునాతన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేజీటూ పీజీ విద్యా వ్యవస్థలో భాగంగా ఇప్పటికే 1100 గురుకుల పాఠశాలలు, 1450 ఇంటర్మీడియట్ గురుకుల కళాశాలలు, 95 డిగ్రీ గురుకుల కళాశాలలు, 56 మహిళలకు డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

**కరోనా సమయంలో..**

- డిజిటల్ క్లాస్‌లను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణనే అన్నారు. మన రాష్ట్రాన్ని చూసి చాలా రాష్ట్రాలు దూరదర్శన్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను ఏర్పాటు చేశాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రస్తుతం అడ్మిషనల్‌లకు పోటీ పెరిగిందన్నారు.
- పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, డ్రస్‌లను అందజేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు.

**మణికొండ పాఠశాల ఆదర్శం...**

మన ఊరు మన బడి కార్యక్రమంలో ప్రభుత్వం చేపట్టబోయే పనుల్లో పాఠశాలల రూపురేఖలు మారే విషయంలో మణికొండ పాఠశాల ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి అన్నారు. దీనిపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ పాలకకమిటీ అధికారులను ఆమె ఈ సందర్భంగా అభినందించారు.

- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలను ఆదే తరహాలో భవిష్యత్తులో తీర్చిదిద్దుతామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారవుతాయన్నారు.

**రూ.50 కోట్ల స్థలం ఇవ్వడం గర్వకారణం...**

ఓ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ. 50 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించటం అందులో రూ. 1.70 కోట్లతో అధునాతన భవనం నిర్మించటం గర్వకారణమని ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- కార్పొరేట్ పాఠశాలల్లో సైతం ఇలాంటి సౌకర్యాలు లేవని, విద్యార్థులు, ఉపాధ్యాయులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలను సాధించాలన్నారు.

**మరిన్ని సౌకర్యాలను పెంచుతాం..**

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోందని ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని దీనికి తగినట్టుగా అదనపు తరగతి గదులు, సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, ఎంఈఓ రామిరెడ్డి, కౌన్సిలర్‌లు, వివిధ శాఖల అధికారులున్నారు.